



భీశెట్టి లక్ష్మణరావ్

| | పాత్రలు | స్వరూప స్వభావాలు | సుమారువయస్సు |
|---|---|---|---|
| 1. | భారతమ్మ | సమితి ప్రెసిడెంటు | 45 |
| 2. | రాము | భారతమ్మ పెద్ద కొడుకు | 27 |
| 3. | రవి | భారతమ్మ రెండో కొడుకు | 25 |
| 4. | విలియం | వి. ఎల్. డబ్ల్యు. | 30 |
| 5. | నాగభూషణం | భూస్వామి | 47 |
| 6. | దేవయ్య | కంట్రాక్టర్ | 50 |
| 7. | రహీం | నాగభూషణం కుడిభుజం | 40 |

(దృశ్యం: అదొక పల్లెటూరు. స్టేజికి మధ్యగా రచ్చబండ— కుడివేపు భారతమ్మ పూరిల్లు— ఎడమ వేపు శ్రీమంతుడు నాగభూషణం భవంతి వుంటాయ్! నేపథ్యంలోంచి—

జననీ జన్మ భూమిశ్చ.....
స్వర్గాదపీ గరీయసీ.....

— శ్లోకం విన్పిస్తుంది. అది పూర్తి కావడంతోనే తెర తొలగుతుంది. బయట్నుంచి దేవయ్య పరుగెత్తుకొస్తాడు.)

దేవయ్య:— (కంగారుగా) నాగభూషణంగారూ! అయ్యా నాగభూషణంగారూ!

(గదిలోంచి నాగభూషణం వస్తాడు.)

నాగ:— (వస్తూ) ఏమిటోయ్... ఆ కంగారు?

దేవ:— కంగారు కాదండి! కొంప మునిగింది.

నాగ:— ఆ!

దేవ:— అవునండి! భారతమ్మ అన్నంతపనీ చేసి మరీ చూపించింది.

నాగ:— అంటే కరకట్ట వేశారా?

దేవ:— కరకట్ట వేయడం— వరద గండం గట్టెక్కడం అంతా పూర్తయింది. సంతోష తరంగాలతో కేరింతలుకొడ్తూ మరీ వస్తున్నారు— జనం.

నాగ:— అలాగా!

దేవ:— అవునండి! ఆ వంతెన కంట్రాక్టు చేసింది నేను. పెద్దవారుగదాని మీ మాటలు నమ్మి— సిమెంటులో యిసుక మోతాదు పెంచాను. ఫలితంగా, కట్టి మూడు మాసాలైనా కాకముందే వరదకు కూలిపోయిందంటే.....

నాగ:— (నిర్లక్ష్యంగా) ఫర్వాలేదు లేవోయ్!

దేవ:— ఆ!

నాగ:— లేకపోతే ఏమిటయ్యా! కుంభవృష్టిలో వరదొచ్చింది. వంతెన కూలిపోయింది. అందుకు నువ్వేం చేస్తావయ్యా!

దేవ:— అని మీ రంటున్నారు. కాని, గ్రామస్థులు నమ్ముతారటండీ! ఉప్పెవలా మీదపడి చంపెయ్యరూ! ఇక నాకు కాంట్రాక్టులు దొరుకుతాయటండీ!

నాగ:— మరేం ఫర్వాలేదు. (ఆలోచిస్తూ) మొత్తానికి కరకట్ట నిర్మించి గ్రామాన్ని కాపాడిందన్నమాట— భారతమ్మ.

దేవ:— అవునండి బాబూ... అవునండి. అన్నమాట అక్షరాలా అమలు జరపబట్టే కదండీ... ఆమెని గ్రామదేవతలా వూరేగించేస్తున్నారీ మాయదారి ప్రజలు. మీ రెన్నైనా అనండి! భారతమ్మ గొప్ప ధైర్యస్తురాలు లెండి. లేకపోతే మగరాయుడిలా అందర్నీ సమీకరించడ మేమిటి!, వరదలో ముందు, కురకడ మేమిటి? ప్రాణాలకు తెగించి కరకట్టను నిర్మించడ మేమిటి? హో... హో....హో...

నాగ: (కోపంగా) దేవయ్యా!

దేవ: అయ్యా!

నాగ:— ఎవరి దగ్గర మాట్లాడుతున్నావో తెల్సా....?

దేవ:— క్షమించండి!

నాగ:— జాగ్రత్త!

(బయట్నుంచి రహీం పరుగెత్తుకొస్తాడు.)

రహీం:—(కంగారుగా) కొంపా మునిగింది సాబ్..!

నాగ:— ఏమిట్రా రహీం?

రహీం:— హంతా హద్గ యీ దేవయ్యగారి వల్లే వచ్చింది సాబ్. వంతెన్ కూలిపోవడం— యీ దేవయ్యే దానిక్ కారణమని ప్రాణాలు తోడుతామంటున్నారు సాబ్— ప్రజలు!

దేవ:—(లబో దిబో మంటూ) అయ్య బాబోయ్!

(సరిగ్గా అదే సమయంలో లోపల 'భారతమ్మకు జై' అన్న నినాదాలు మిన్ను ముట్టాయి.)

దేవ:— (కంగారు పడిపోతూ) నాగభూషణం గారూ! ఇవి చేతులు కావు. నన్ను మీరే కాపాడాలి.

(జనం జేజేలు పలుకుతూండగా భారతమ్మ వస్తుంది. ఆ వెనుక విలియం, రాము లుంటారు.)

విలి:— ఇదిగో! కంట్రాక్టరు దేవయ్య యిక్కడున్నాడు.

రాము:— దేవయ్యా! డబ్బుకి గడ్డి కరిచి గ్రామానికి ద్రోహం తలపెడతావా! నిన్ను . . .

(అమాంతంగా పైకి ఉరకబోతాడు..)

భార:— రామూ! ఆవేశం అనర్థాలకు మూలం! ఏమిట్రా ఆ దుడుకు తనం?

నాగ:— ఉడుకు నెత్తురు కదూ....!

భార:— చూడండి దేవయ్యగారూ! మీ స్వార్థానికి యీనాడు ఎన్ని ప్రాణాలు బలై వుండేవో తెల్సా? పశు, శిశు, వస్తు, ధన ధాన్యాలన్నీ నాశనమై— ఆ వరద ముంపుకి సర్వ నాశనమైపోయేది మన గ్రామం. అందరి సమిష్టి కృషితో— కరకట్ట నిర్మించు కున్నాం గనుక సరిపోయింది. లేకపోతే . . . .

నాగ:— అదే నేను చెప్పబోయేది కూడా . . .! ఏదో పొరపాటు జరిగుంటుంది.

విలి:— సమర్థించ ప్రయత్నించకండి! మీలాంటి వారి ఆసరావల్లనే . . . .

నాగ:— (కోపంగా) విలియం! అనవసరంగా మాటలు మీరు తున్నావ్!

రాము:— లేకపోతే ఏమిటండీ! గ్రామాభ్యుదయానికి పాటు పడవలసిన మీలాంటి శ్రీమంతులు— గ్రామపెద్దలు యితను చేసిన ద్రోహానికి వెనకేసు కొస్తారా? అమ్మ వూరుకోకపోతే గ్రామం

ఏమయ్యేదో తెల్సా?

నాగ:— ఏమయ్యేదేం?

రాము:— అవును. పేదల్లో, పెట్టి పురువుల్లో సుఖ సంతోషా లనుభవించే విధానం తెలుస్తుంది తెలండి— నిరుపేదల ఘోష!

నాగ:— భారతమ్మా! రాము తరతమ భేదాలు మరచి మాట్లాడుతున్నాడు.

భార:— రామూ! ముందు వెళ్ళి ఆ ఎరువుల పంపకం వ్యవహారం చూడు!

రాము:— అమ్మా!

భా:— వెళ్ళమంటున్నాను. వెళ్ళు!

రాము:— ఊ! (అంటూ కోపంగా—నాగభూషణం—దేవయ్యల వేపు చూసి బయటకు వెళ్తాడు)

భా:— దేవయ్యగారూ! న్యాయం దగ్గర స్వపర భేదంలేదు. ఈ అవినీతి చర్యకు ఫలితంగా మీకు రావాల్సిన బిల్లునురద్దుచేయిస్తున్నాను.(విలియంతో) విలియం! దేవయ్యగారి బిల్లు రద్దు చేయిస్తున్నట్లు ఆర్డరు టైపు చెయ్యమనండి. వెంటనే సమితికి వెళ్ళండి.

విలి:— అలాగేనమ్మా (బయటకు వెళ్తాడు)

దేవ:— అన్యాయం భారతమ్మగారూ! అన్యాయం.

భార:— ఏమిటండీ అన్యాయం? మీరు చేసిం దానికంటేనా?

నాగ:— చూడు దేవయ్యా! భారతమ్మమాటంటే మాటే! ఆ విషయాలన్నీ చూసేవాడ్ని నేనున్నానుగా (కనుసైగతో) ముందు నువ్వు వెళ్ళు.

దేవ:— తమ దయ!

(అంటూ దేవయ్య బైటికివెళ్తాడు. భారతమ్మ లోనికి వెళ్ళబోతుండగా—)

నాగ:— (ప్రక్కనున్న రహీంతో) రహీం! మస్తాళ్ళి.... (కళ్ళతో ఏదో చెప్తాడు)

రహీం:— అచ్ఛాసాబ్....! (బంగళాలోనికి వెళ్తాడు)

నాగ:— (లోనికి వెళ్ళబోతూన్న భారతమ్మతో) చూడండి భారతమ్మగారూ! దేవయ్య విషయంలో —సమితి ప్రెసిడెంటుగా మీ కర్తవ్యం, బాధ్యత నెప్పుదగిందే ననుకోండి! కానీ...

భార:— ఏమిటండీ..... మీరనేది?

నాగ:— అబ్బే! ఏంలేదు! ఇటువంటి విషయాల్లో మనం కాస్త లౌక్య వైఖరి అవలంబించడం అవసరం...... అందుకని....

భార:— ఆ! అందుకని...

(ఇంతలో రహీం వస్తాడు. నాగభూషణం చేతిలో పెద్ద పర్సు వుంచుతాడు.)

నాగ:— (పర్సుతీసి) దేవయ్య బిల్లును కాస్త..... (అంటూ పర్సు యివ్వబోతాడు)

భార:— లంచం యిస్తున్నారా?

నాగ:— మీరలా అనుకుంటే నేనేం చెప్పగలను చెప్పండి! మనలోమనం..... ఏదో మామూలు.....

భార:— అయితే వంతెన కంట్రాక్టు విషయంలో మీకూ భోక్యం వుందన్నమాట! నాగభూషణం గారూ! పెద్దలుమీరు! ఒకప్పుడు ఈ గ్రామానికి ప్రెసిడెంటుగా వ్యవహరించిన వారు! ఇదా మీరు చేయాల్సిన పని?

నాగ:— నిజమే! నేను మాత్రం కాదన్నానా? కాని, ఏం చేస్తాం చెప్పండి. పరిస్థితులను బట్టి సర్దుకుపోతూండాలి.

భార:— అంటే..... దేవయ్య బిల్లును రద్దు చెయ్యకూడదన్నమాట!

నాగ:— అర్థమైందనుకుంటాను.

భార:— అందుకేనా యీ లంచం? మర్యాదగా తీసికోండి. గ్రామ పురోభివృద్ధికి అధినేతగా ఎన్నుకున్నారీ ప్రజలు. అలాంటి వారి నెత్తిన చేతులువేసి ఖజానాలు నింపుకోబోవడం సహింపరాని విషయం. మరోసారిలా సంఘ విద్రోహకర శక్తుల్ని ప్రోత్సహిస్తే పోలీసు రిపోర్టు యివ్వాల్సి వస్తుంది. జాగ్రత్త (విసురుగా లోనికెళ్తుంది.)

నాగ:— (పళ్ళు కొరుకుతూ) చూస్తాను— ఆ నీతీ నిజాయితీ లేమిటో! చూస్తాను! నన్ను తిరస్కరిస్తే......

రహీం:— మాకీ చెప్పండి సాబ్! మేమూ అంతు తేల్చేస్తాం!

నాగ:— తొందర పడకు. సమయమొస్తుంది. భారతమ్మ భర్త పైలోకం వెళ్ళాక యీ ప్రెసిడెంటు పదవి నాకే వస్తుందనుకున్నాను. రూకల్ని మూకల్లా వెదజల్లాను. కాని..... మూర్ఖ ప్రజలు యీమెను సమితి ప్రెసిడెంటును చేశారు. ఆ... ఆసరాతో ప్రజల్ని గుప్పెట్లో పెట్టుకొని సంస్కరణ వంతం, సౌభాగ్యవంతం చేస్తుందట గ్రామాన్ని!అదీ చూస్తామురా....!

(విసురుగా బంగళాలోనికి వెళ్తారు)

(రాము, రవి నవ్వుకుంటూ వస్తారు— బయట్నుంచి)

రాము:— తమ్ముడూ! నువ్విక్కడే వుండు. (లోనికి చూచి) అమ్మా! అమ్మా! ఎవరొచ్చారో చూడు?

రవి:— (పక్కకు చూచి) అన్నట్టు నాగభూషణంగారు వూళ్ళోలేరా అన్నయ్యా?

రాము:— (కోపంగా) ఎందుకు లేరూ? ప్రెసిడెంటు పదవి అమ్మకు రావడంతో కుళ్ళి చస్తున్నాడు.

రవి:— అలాగా! ఆ! చూడన్నయ్యా! అడుగుతున్నానని ఏమీ అనుకోనంటే ఒకమాట అడగనా?

రాము:— ఏమిటి రవీ నా దగ్గర సందేహమా?

రవి:— అబ్బే, ఏంలేదు. బియ్యేస్సీ అగ్రికల్చరల్లో పాసయ్యావు. ప్రయత్నిస్తే పట్నంలో మంచి ఉద్యోగం దొరికేది! కాని, నువ్వేమో యీ పల్లెసీమను వదలి పెట్టేటట్టు లేవు.

రాము:— ఓ... అదా నీ సందేహం! చూడు తమ్ముడూ! చదువుకున్న వారంతా పట్నం వేపు మొగ్గు చూపిస్తే— యిక యీ అమాయక గ్రామ జీవుల్ని ప్రభావితుల్ని చేసేదెవరు చెప్పు!

రవి:— అందుకని..... మన భవిష్యత్తును నాశనం చేసుకుంటామా!

రాము:— అలా అని ఎవరన్నారు రవీ?

రవి:— కాకపోతే ఏమిటన్నయ్యా యిది? నీ విజ్ఞానాన్ని కుదువబెట్టి వ్యవసాయంలో కొత్త పద్ధతులు ద్వారా ఏదో సాధిద్దామనుకున్నావు, గ్రామానికి సేవ చెయ్యాలనుకున్నావ్. కాని, ఏం సాధించావో.... ఏమో..... అంతా అయోమయంగా వుంది.

రాము:— పొరపడుతున్నావు తమ్ముడూ! నువ్వు స్టేషను నుండి వస్తుంటే— దారిపొడవునా కనిపించే పొలాలు ఈనాడెలా వున్నాయో గమనించావా? పచ్చని పైరులతో ప్రకృతి కాంత పులకిస్తున్నట్టు అనిపించలేదూ! గ్రామస్థుల్లో మునుపటి నైరాశ్యం గానీ, నిస్తేజంగాని మచ్చుకైనా ఉందా? అంటే ఏమిటి? ప్రతిఒక్కరూ కండలు కరిగించి, చెమటోడ్చి పని చేస్తున్నారు. అందుకు సహాయంగా నా విజ్ఞానాన్ని జోడిస్తున్నాను. ఫలితంగా బంగారం పండుతోంది. అమ్మ—సమితి ప్రెసిడెంటయి ఎరువుల సక్రమ పంపిణీ, మేలురకం విత్తనాల సరఫరా—రైతులకు కావలసిన సహకార సంపత్తులన్నీ సమితిద్వారా కలుగజేస్తుంది. ఇన్ని ప్రగతి దాయక కార్యక్రమాలు యీ గ్రామంలో మునుపు ఎప్పుడైనా చూడగలిగామా తమ్ముడూ! ప్రతి పూరి గుడిసె—ఒక కుటీర పరిశ్రమగానూ, ప్రతి బంజరు నేల పచ్చని పంటపొలంగానూ రూపొందించాలని నినాదమిచ్చారు— మన పూజ్యులు. అందుకు అంకితమై— గ్రామాదికి గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే.... నువ్వేమో......

రవి:— కాదనను. కాని, నువ్వూ—అమ్మా ఆశించిన యీ ఆశయం నెరవేరుతుందా!

రాము:— 'కృషతో నాస్తి దుర్భిక్షం' అన్నారు— పెద్దలు. అందుకే రవీ! యీనాడు మన గ్రామం యింత కళకళలాడుతోంది. కాస్త ఆలోచించి చూడు! అమ్మ సమితి ప్రెసిడెంటు అయ్యాక ప్రజల్లో ఎంత మార్పు వచ్చిందో! విద్యాభివృద్ధికి గ్రంథాలయం స్థాపించబడింది. పారిశుధ్యపు ఏర్పాట్లు మెరుగు పర్చబడ్డాయి. నిరక్షరాస్యత తొలగించేందుకు ప్రతి తల్లిదండ్రీ తమ బిడ్డల్ని చదివిస్తున్నారు. మహిళామండలులు ఏర్పరచబడ్డాయి. పరస్పరావగాహనతో— సోదర భావంతో అంతా సహజీవనం సాగిస్తున్నారు. ఇదంతా మనం సాధించుకున్న ప్రగతి కాదంటావా?

రవి:— ఏమిటో అన్నయ్యా! నువ్వెంత చెప్పినా యీ పల్లెటూరిలో ప్రాక్టీసు పెట్టడానికి నా మనస్సంగీకరించడం లేదు.

రాము:— (ఆశ్చర్యంగా) తమ్ముడూ నీ నిర్ణయం వింటే అమ్మ ఎంత బాధ పడుతుందో తెల్సా?

(భారతమ్మ వస్తుంది.)

భార:— ఎవరా....? రవీ....!

రవి:— అమ్మా!

(వెళ్ళి తల్లి పాదాలకు నమస్కరిస్తాడు.)

రాము:— అమ్మా! తమ్ముడిప్పుడు ఒట్టి రవి కాదమ్మా! డాక్టర్ రవి. యూనివర్శిటీ మొత్తం మీద ఫస్టుక్లాసులో పాసై డాక్టరు పట్టా పొందాడు, ఈ సంతోషసమయంలో గ్రామానికంతా విందు

చెయ్యాలి ఏం తమ్ముడూ! నేను చెప్పింది కరక్టే కదూ!

రవి:— నాదే ముందన్నయ్యా! అంతా అమ్మ ఇష్టం!

భార:— మీ సంతోషమే నా సంతోషం బాబూ!

కాని.... విందులూ విలాసాలకు దుబారా చెయ్యడం యీ పరిస్థితుల్లో మనకు తగని పని! వీలున్నంత మేరకు పొదుపును పాటించడం— మన ప్రస్తుత కర్తవ్యం!

రాము.— ఏమిటమ్మా యిది? మనం ఒక్కరం పొదుపు చేసినంత మాత్రాన బాగుపడి పోతుందా— దేశం! అంతా నీ భ్రమ.

భార:— ఇంటింట ఒక్కో పువ్వు దండితే ఈశ్వరుడికో మాల అవుతుంది. అది మర్చిపోకు! చూడు రవీ! మీ నాన్నగారు యీ గ్రామసౌభాగ్యం




కోసం తన ప్రాణాల్ని పణంగా పెట్టారు. ఆయన గాంధేయవాది. వారి ఆశయాలు, ఆశలు నెరవేర్చ టం బిడ్డలుగా మీ కర్తవ్యం. ఆ ఆశతోనే జీవి స్తున్నాను బాబూ!

రవి:— తప్పకుండా నమ్మా! నా ఆశ, ఆశయం కూడా అదే! పట్నంలో ప్రాక్టీసు పెట్టి లక్షలు సంపాదిస్తాను.

భార:— (ఆశ్చర్యంగా) ఏమిటీ? పట్నంలో ప్రాక్టీసు పెడ్తావా?

రవి:— అవునమ్మా! లేకపోతే ఈ గ్రామంలో ఏముంది చెప్పు! మంచి పార్కులుగానీ... కాఫీ క్లబ్బులుగానీ.... కనీసం మంచీ మర్యాదా తెల్సిన


పండిత్ డి.గోపాలాచార్యులవారి
అరుణ
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
... నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
...-జి.ఎన్.రోడ్, మదరాసు-17.

35 సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకులు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
రే అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట,
... మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర.
... ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544.


వాయిదాలలో ట్రాన్సిస్టర్ 3 BAND
PRICE Rs 165
SOUND SALES
ROOP NAGAR
(31) DELHI-7


# సమత

మనుషులు గానీ.....

భార:— లేరనా నీ ఉద్దేశం? గ్రామసీమల గురించి, పల్లె ప్రజల గురించి చాల తప్పుగా అర్థం చేసుకున్నావు రవీ! ఇదా యిన్నాళ్ళ నువ్వు కష్టపడి ఆర్జించిన విజ్ఞానం? ఇది నీవంటి విద్యాధికుడు అనతగ్గ మాటలేనా? డబ్బు—డాబు, దర్పం గురించే ఆలోచించావు గానీ.... మమతా మానవ త్వాలకు పుట్టినిల్లయిన పల్లెసీమల్ని అర్థం చేసుకో లేక పోయావు. కల్లాకపటం లేని నిష్కళంకులు బాబూ గ్రామస్థులు. వాళ్ల ప్రభావితం కోసం, సుఖజీవనం కోసం పాటుపడవలసిన బాధ్యత నీలాంటి విద్యాధికుల మీద వుంది.

రవి:— అమ్మా......!

భార:— 'మానవసేవ—మాధవసేవ' లాంటిది. పట్టణాల్లో డబ్బు కోసం సేవచేసే డాక్టరు. కోకొల్ల లుగా వున్నారు. కాని.... ఆ ధ్యేయంతో చదివించ లేదు—నిన్ను! పేద ప్రజల పెన్నిధిగా యీ పల్లె ప్రజలకు సేవ చేస్తావనుకున్నాను. నా మాట మీద విశ్వాసం వుంటే— నీ ప్రాక్టీసు యిక్కడే పెట్టు! అనాథలకు సేవ చెయ్యి! మీ నాన్నగారి ఆత్మ శాంతి స్తుంది! నా కోరిక నెరవేరుతుంది.

రాము:— కాదనకు తమ్ముడూ! ఉదాత్తమైన అమ్మ ఆశయాల్ని అర్థం చేసుకో!

రవి:— (ఒక్కసారి తల్లి—రాములవేపుచూచి) అలాగేనమ్మా! నీ సంకల్పాన్ని అర్థం చేసుకున్నాను. తప్పకుండా యిక్కడే ప్రాక్టీసు పెడతాను. నా శక్తి వంచన లేకుండా పేద ప్రజలకు సేవ చేస్తాను.

భార:— (కళ్లొత్తుకుంటూ) చాలా సంతోషం బాబూ! చాలా సంతోషం!

రాము:— అమ్మా! తమ్ముడు ఎప్పుడనగా భోంచేశాడో.... ఏమో! త్వరగా వంట కానియ్యమ్మా!

భార:— అలాగే! కాని... యీరోజు ఏం వారమో మర్చిపోయావా? రామూ!

రాము:— సోమవారం కదూ!

రవి:— అంటే....

భార:— సోమవారం ఒంటిపూట మాత్రమే భోంచేసి—ఆహార పొదుపుకి దోహదం చేయాలన్నారు —మన లాల్ బహదూర్ శాస్త్రిగారు!

రాము:— అంచేత రవీ! ఈరోజు నీకూ ఉప వాసమే!

రవి:— మరేం ఫర్వాలేదన్నయ్యా! పూజ్యుల మాటలు మన్నించడం, ఆచరించడం మన ధర్మం! (భారతమ్మతో) అలాగేనమ్మా! మీతోపాటే, నేనూనూ!

రాము:— (ఆశ్చర్యంగా) తమ్ముడూ!

(అమాంతంగా కౌగిలించుకుంటాడు)

భార:—(కళ్లొత్తుకుని) రామలక్ష్మణుల్లాంటి కొడుకులు, నా జీవితం ధన్యమైంది. రండిబాబూ!

(ముందు భారతమ్మ—ఆ వెనుక రాము—రవిలు లోనికి వెళ్తారు)

(లైట్స్ ఆఫ్ అండ్ ఆన్)

(బయటనుంచి— వీరయ్య గాబరాగా వస్తాడు లోపల్నుంచి భారతమ్మ వస్తుంది)

భార:— ఏమిటి వీరియం, ఏమైంది?

వీరి:— నాగభూషణంగారు కుట్ర పన్నారు. రైతులకి కౌలుకి తన పొలాల నిచ్చి సేద్యం చేసిందాకా వూరుకున్నాడా:..... ఆనాడు!

భార:— అవును!

వీరి:— మరిప్పుడేమో.... పంటకాస్త చేతి కొచ్చే సమయం చూచి పంటతో సహా పొలాల్ని లాక్కున్నాడు.

భార:— ఆ!

వీరి:— అవును! అక్కడ రైతులు గగ్గోలు పెడుతున్నారు. మీరు రాకపోతే......

(ఈలోగా లోపల్నుంచి రాము—రవి వస్తారు).

రాము:— ఇది అన్యాయం! కౌలు కిచ్చిన పొలాల్ని పంటతో లాక్కోవడం— సహించరాని విషయం!

రవి:— ఔను! ఆయనకు కావాల్సింది కౌలు! అంతేగాని రైతులు పండించింది భుక్తం చేసుకో ప్రయత్నించడం అక్రమం.

(నాగభూషణం—రహీంలు లోపల్నుంచి వస్తారు)

నాగ:— ఏమిటి అక్రమం! (రవినిచూచి) నా పొలాల్ని నేను హస్తగతం చేసుకోవడం అక్రమమా?

భార:— అవును! ఆ భూముల్ని సాగు చెయ్య డానికి రైతులు రక్తం ధారపోశారు. వాళ్ల చెమటతో పొలాల్ని పండించుకున్నారు.

నాగ:— కాని, నేను భూమికి హక్కుదారుణ్ణి!

భార:— కాబట్టే మీరు శిస్తు తీసికో గలుగు తున్నారు. చూడండి నాగభూషణం గారూ! ఈ దురాలోచన మీ కెందుకు కలిగిందో అర్థంకాదు. కష్టపడి పండించిన రైతు తను తిన్నా, తినక పోయినా— క్రమం తప్పకుండా మీకు శిస్తులు కడుతున్నారు. ప్రభుత్వం వారి ఆధునిక పనిముట్ల సహాయంతో—మంచి ఎరువులు వాడడంతో ఈ యేడు బంగారం పండించుకున్నారు. తమ కష్టానికి ఫలితం దక్కిందని సంతోషించే ఈ సమయంలో ఆ భూముల్ని పంటతోసహా స్వాధీనపర్చుకోవడం ధర్మం కాదు.

నాగ:— ఆ ధర్మాధర్మాలేమిటో నాకూ తెల్సు!

రాము:— తెలిస్తే మీరీ అన్యాయానికి తలపెట్టి ఉండరు.

నాగ:— వాదించి, సమాధానం చెప్ప వలసిన అవసరం నాకులేదు. నా భూముల్ని నేను స్వాధీన పర్చుకున్నాను. అత్యాశకు పోతే అంతే!

రాము:— అత్యాశకుపోయి, అక్రమంగా నడి చింది మీరు!

నాగ:— రామూ! నీ జోక్యం అనవసరం! ఎవ రైనా దౌర్జన్యం చేసి పొలాల్లో అడుగు పెట్టారా.... పోలీసు రిపోర్టు యివ్వాల్సి వస్తుంది. జాగ్రత్త! రా... రహీం!

(అంటూ రహీం వెంటరాగా—నాగభూషణం విసు రుగా బయటకు వెళ్తాడు).

వీరి:— (బాధగా) భారతమ్మగారూ! నాగ భూషణంగారి అన్యాయాన్ని అరికట్టక పోతే....బీదా

టిక్కి నాశనమై పోతారు. చేతి కొచ్చినవేంట కొన్ని చేజిక్కించుకున్నారు. ఇప్పుడేమిటి దారి?

రాము:— పండించేదొకరూ— పొట్టనింపుకొనేది మరొకరునా? ఏమైనా గానీ, ఈ దౌర్జన్యాన్ని ఆపాలమ్మా!

రవి:— అవును. అరికట్టి తీరాలి.

భార:— ధర్మదేవత మన వేపు వున్నప్పుడు ప్రాణాలు పోయినా, పోరాడ్డానికి సంసిద్ధమే. రండి! ఇంతమంది సమాధుల మీద పునాదులు ఎలా నిర్మించుకుంటాడో చూద్దాం! ఆ భూముల్ని పునరాక్రమణ చేసుకుందాం పదండి!

(అంటూ భారతమ్మ ముందడుగు వేయగా— అంతా భారతమ్మను అనుసరిస్తారు. అందరూ వెళ్ళాక—లోపల్నుంచి నాగభూషణం, రహీం వస్తారు)

రహీం:— ఇప్పుడు ఎట్లా సాబ్?

నాగ:— చూస్తాను. భూముల పునరాక్రమణ ఎలా జరుగుతుందో నేనూ చూస్తాను.

(అదే సమయంలో— బయట్నుంచి కంట్రాక్టర్ దేవయ్య వస్తాడు).

దేవ:— నాగభూషణంగారూ! అయ్యా నాగభూషణంగారూ! ఈ అన్యాయాన్ని చూస్తూ కూడా యింకా నిలబడ్డారేమిటంట! తరతరాల నుండీ సంపాదించుకొన్న పొలాలు, ఈనాడిలా వాళ్ళు ఎదురుతిరిగి దున్నేవానిదే భూమని లాక్కోబోతుంటే కళ్ళప్పగించి చూస్తూ వూరుకోవడమే? అమ్మమ్మా! ఎంత అప్రదిష్ట.... ఎంతవమానం?

నాగ:— దేవయ్యా!

దేవ:— అయ్యా!

నాగ:— నోర్ముయ్!

దేవ:— మహాశానయ్యా! కానీ... నా కడుపు మండుతుందే! ఏదో కాస్త గడ్డి కరిచానే అనుకోండి! అయినా ఎలా బ్రతికేవాళ్ళు అలా బ్రతుకుతారని ఊరుకోకూడదటండీ! దానికో పేద్ద రాద్ధాంతం చేసి నా నోటమట్టిగొట్టి ఆ వంతెన బిల్లు కాస్తా పాస్ కాకుండా చేశారంటే..... పోనీ... చేశారే అనుకోండి! కాని యిదలా కాదే!

రహీం:— అవును. ఇదీ హన్యాయం సాబ్!

నాగ:—(పళ్ళు కొరుకుతూ) రహీం!

రహీం:— క్యా సాబ్...?

నాగ:— పోలీసు రిపోర్టిచ్చొస్తాను. మీరిద్దరూ అక్కడికి పదండి! ఎవరైనా పొలంగట్టు దిగారో......

దేవ:— దిగడమేమిటండీబాబూ! అప్పుడే దిగేసే ఉంటారు.

నాగ:— అలాగే గనుక దిగినట్లైతే....

రహీం:— నెత్తురు కళ్ళజూపిస్తాను సాబ్!

నాగ: జాగ్రత్త! వెళ్ళండి!

(రహీం—దేవయ్య బయటకు—నాగభూషణం గదిలోనికి వెళ్తుండగా)

—లైట్స్ ఆఫ్ అండ్ ఆన్—

(ముగింపు పైవారం)

రసవర్గాలూ - గుణాలూ :

# చీనా పంచదార

పంచదార ఎలా వాడుతున్నదీ ప్రత్యేకించి తెలియజెయ్యాల్సిన అవసరం లేదనుకుంటాను.

ఇది వేడిచేసి నీరు పెంచుతుంది. వీర్యవృద్ధి. బలమునిస్తుంది. మూర్ఛ, సర్వ ప్రమేహాలు, దాహం, జ్వరం, బడలిక, వాంతి, ధాతుక్షయం, మందాగ్ని, క్షయ, రక్తపైత్యం, ఎక్కిళ్ళు, మేహాతిసారం, పైత్యవికారం, ఉన్మాదం, కామిర్లు, తలత్రిప్పు, తాపం ప్రదరమనుయోని రోగం వీనిని శమింపజేస్తుంది.

ద్వంద్వ రోగులకు యిది అనుపానంగా యివ్వతగినది. ఔషధానికి అనుపానంగా యిస్తే దానిని శీఘ్రంగా దేహమందంతటా వ్యాపింప జేస్తుంది.

గొంతుకను, రొమ్మును, లివర్‌ను మృదువు పరచి శుభ్రపరుస్తుంది. కడుపులోని వాతాన్ని వెడలిస్తుంది. మంచి రక్తాన్ని పుట్టిస్తుంది. నరాలకు, ఎముకలకు, లివర్‌నకు సత్తువనిస్తుంది. శరీరంలోపల గట్టిపడిన దుష్టపదార్థ కూటమిని కరిగిస్తుంది.

పరగడుపున వట్టి పంచదారను అధికంగా తిన్నట్లయితే ఆకలి మందగిస్తుంది. అజీర్ణం చేస్తుంది. పంచదార తినిన వెంటనే నీళ్ళు త్రాగకూడదు. వెంటనే నీళ్ళు త్రాగితే జలుబు, వాతం, శ్లేష్మం చేస్తుంది. జ్వరం రావచ్చు.

దీని యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:—
1. తుంగముస్తల చూర్ణం, 2. బాదంపప్పు, 3. పచ్చిపాలు 4. పులుపు పదార్థాలు.

## బెల్లం

కొన్నిరకాల స్వీట్సులోను, కొన్నిరకాల కూరలలోను, కొన్నిరకాల పచ్చళ్ళలోను, కొన్ని ఔషధాలలోను బెల్లం వాడుతూంటారు.

ఇది జ్వరం, శూల, ఉదరరోగం, వాతం గలవారికి మేలు చేస్తుంది.

ఇది బాలింతలకు, మసూచికం పడినవారికి గాయాలు తగిలిన వారికి పథ్యమయినది.

స్త్రీసాంగత్యం చేసిన వెంటనే సుమారు ఒక గోళీ కాయంత బెల్లాన్ని నమలి మ్రింగితే నీరసం తగ్గుతుంది.

క్రొత్త బెల్లం కంటే పాత బెల్లం శ్రేష్టమైనది. జఠరదీప్తి నిస్తుంది. పాండువు, ప్రమేహం గలవారికి మేలు చేస్తుంది. శ్రమను పోగొడుతుంది.

బెల్లం అధికంగా తింటే కడుపులో పురుగులు పుడతాయి. దగ్గు పట్టుకుంటుంది. విరేచనబద్ధం చేస్తుంది. అజీర్ణం పట్టుకుంటుంది.

దీని యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:—
1. శొంఠి, 2. బూడిద గుమ్మడి కాయరసం.

## తేనె

సాధారణంగా తేనె వేడిచేసి ఆర్పుతుంది. త్రిదోషాల్ని హరింపజేస్తుంది. శరీరానికి శక్తినిస్తుంది.

పైత్యం, సన్నిపాతం, కడుపునొప్పి ఎక్కిళ్ళు, వాంతి, మూర్ఛ, క్రిమిరోగం, అనేకరకాలయిన విషదోషాలు, చర్ది, రక్తపైత్యం, కుష్టు, ఊపిరిగొట్టు నొప్పి, వాతం, శ్లేష్మం, దగ్గు, వగర్పు, మేహం, అతిసారం, శీతపైత్యం, కఫం, పక్షవాతం వీనిని హరిస్తుంది. శరీరంలోని దుష్టపదార్థాన్ని తొలగిస్తుంది. మూత్రపు సంచిలోని రాతిని కరిగిస్తుంది. పొట్టకు, హృదయానికి సత్తువనిస్తుంది.

సుమారు తులమెత్తు తేనెను, మూడు నాల్గు తులాల ఎత్తు వేడినీళ్ళతో కలిపి పుచ్చుకుంటే గుండెనొప్పి, వికారం తగ్గుతాయి.

కాచి వడగట్టిన తేనె శ్రేష్ఠమయినది. శేరు తేనెకు ఒక వరహా ఎత్తు పసుపు వేసి కాచడం మంచిది.

ఉష్ణ శరీరులు తేనెను అధికంగా పుచ్చుకోకూడదు. అధికంగా పుచ్చుకుంటే తలనొప్పి వస్తుంది. విరేచనాలవుతాయి. మిక్కిలి వేడి చేస్తుంది. తేనె, నెయ్యి సరిసమానంగా కలిపి ఎన్నడూ పుచ్చుకోకూడదు. అది విషతుల్యమయిపోతుంది.


తేనె యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:—
1. నీళ్ళు, 2. దానిమ్మకాయ, 3. నిమ్మకాయ, 4. నారింజకాయ, 5. ధనియాలు.

**సేకరణ: ఆకుండి నారాయణమూర్తి**

నాటిక

# సమత

భీశెట్టి లక్ష్మణరావు



( గత సంచిక తరువాయి )

(నాగభూషణం విచారంగా రచ్చబండమీద కూర్చుంటాడు. దేవయ్య—రహీం చెరొకప్రక్క చేతులు కట్టుకొని నిలబడి వుంటారు.)

దేవ—నన్నడిగితే కోర్టుకు కళ్ళూ— చెవులూ రెండూ లేవంటాను. లేకపోతే ఏమిటండీ యీ అన్యాయం? భూములు వీరివి కావడమేవిటి? రైతులు కాలుకు దున్నుకోవచ్చని కోర్టు తాత్కాలిక యింజక్షన్ జారీచేయడమేమిటి.? ఛ.ఛ..! అంతా చుక్కెదురైంది.

నాగ— మతిలేక మీలాంటి వాళ్లను నమ్మడం వల్ల వచ్చిన అనర్థమయ్యా.. అనర్థం!

దేవ—గొర్రెలు తినే స్వరాజ్యరావు చచ్చాడను కుంటే— బర్రెలు తినేందుకు యీ భారతమ్మ బయల్దేరిందేమిటండీ!

నాగ—ఉన్నదంతా ఎక్కడ వూడ్చుకు పోతుందో నని నేనేడుస్తుంటే మధ్య నీగోలేమిటయ్యా!

రహీం— చెప్పండిసాబ్! హెవిష్టా వేయమంటారో..! సమయానికి మీరువచ్చి హడ్డుకున్నార్ గాని... లేకపోతేనా, ఆరోజు ...నెత్తుర్లు తాగేవాడిని.

నాగ—నోర్మూయ్! కబుర్లకు మాత్రం తక్కువ లేదు. గ్రామమంతా మూకుమ్మడిగా ఎదురు తిరిగింది. కోర్టులో కేసు గెల్చారు. (పళ్ళు కొరుకుతూ.) సుప్రీముకోర్టు వరకైనా వెళ్లి....

దేవ— వాళ్ల అంతు తేల్చాల్సిందే! అన్నట్లు యిది విన్నారా? గ్రామంలో కులమతాలు వుండ కూడదట! అంతా కలగాపులగం అయిపోవాలట! అందుకని...

నాగ— అందుకని ...

దేవ—ఏముందండీ! వూరి చివర ఎక్కడో వుండే హరిజనులు గిరిజనులు అంతా కలిసి ఒకే బావినీరు త్రాగాలని ప్రచారం మొదలెట్టారు.

నాగ— ఎవరూ..? భారతమ్మగారా?

దేవ—ఆ! కాక, అంతదమ్ము మరెవరికుందండీ!

నాగ— సహించరాని విషయమిది!

(భారతమ్మ వస్తూంది.)

భార—ఏది సహించరాని విషయం? సర్వం సమానత్వంగా భావించి, హెచ్చుతగ్గులు తారతమ్యాలను రూపు మాపాలనుకోవడం సహించరాని విషయమా?

నాగ— చూడండి భారతమ్మగారూ! యిలాంటి ఉపద్రవమైన పనులు చేయడం ?

భార—సహించనంటారా?

నాగ—అవును!

భార— సంఘం మారుతోంది. దేశం మారుతోంది. కాని, మీలాంటి పెద్ద మనుషులు మాత్రం మారరు. అయినా, మీలాంటి ఛాందసులతో. పనిలేదునాకు. మంచినిపెంచి— పదిమందీ సమానత్వంతో జీవించడమే మాసిద్ధాంతం! అందుకు సమితి ప్రెసిడెంటుగా— యీ గ్రామ అధినేతగా చేయవలసిన సంస్కరణలన్నీ చేసి చూపుతాను. ఇందులో మంచివుందని మీకుతోస్తే నాతోచేతులు కలిపి సహకరించండి! లేదా.. మీ యిష్టం!

నాగ—ఆ!

(విసురుగా యింట్లోకి వెళ్తుంది.)

దేవ— (భారతమ్మ వెళ్లిన వేపు చూస్తూ.) సత్సాంప్రదాయం. నేల మట్టమైంది. ఇదిలా కొనసాగనివ్వకూడదు. మీరు పూనుకోకపోతే సంఘం భ్రష్టమైపోతుంది.

రహీం— హశానుసాబ్!

దేవ— మీరలా ఉదాసీనంగా ఉంటే ఈవిడగారి అరాచకాలు మరింత పెచ్చు పెరిగిపోతాయి.

నాగ—అవును! వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి. ఇలా రండి !

(ఇద్దరి చెవిలోనూ ఏదో చెప్తాడు. ఇద్దరూ ఆనందంగా తలలూపుతారు.)

నాగ—ఇదొక్కటే సరైన మార్గం! అవకతవకలుగా ప్రవర్తించారా?

దేవ—ఈ మెడకాయమీద తలకాయ ఉండదని తెలీదటండీ..!

నాగ—ఊ జాగ్రత్త!

(విసురుగా తనగదిలోకి వెళ్తాడు.)

దేవ—(అతను వెళ్లిన వేపు చూస్తూ గబగబా వచ్చి—భారతమ్మ యింటివేపుచూసి.) ఏమైనా గానీ అక్కడ రామమందిరం కట్టాల్సిందే!

రహీం— (కోపంగా) హెమిటయ్యా! రామమందిరం అంటున్నావ్. మాకి మసీదు కట్టాల్సినచోట మీకీమందిరం, గిందిరం అంటే ప్రాణాలుతోడ్తాను ఖబడ్దార్!

దేవ—ఇదిగో రహీం! మళ్లీ మసీదు మాటెత్తావంటే...ముందు నీకు మసీదు కట్టేస్తాన్న ఏమిటనుకున్నావో....

( విలియం వస్తాడు.)

విలి—ఏమిటది? ఎందుకాపోట్లాట?

రహీం—చూడు భయ్యా! ఏదీదేవయ్యామాట! అక్కడ జాగా యిచ్చి చనిపోయిన దాత మాకు మసీదు కట్టుకోమన్నాడు. ఆర్ని అల్లా సల్లగా సూడ! ఇప్పుడేమో మీది దేవయ్యా రామమందిరం అంటున్నాడు.

దేవ— నీకు తెలీదు రహీం! వూరికి మధ్యన తురకల మసీదు వుండకూడదయ్యా! అందుకని రాములవారి కోవెలే కట్టాలి.

రహీం— మందిరం, గిందిరం, జాన్తానై! ఇక్కడ మాది మసీదు కట్టాల్సిందే!

విలి—బావుంది ! ఒకరు రామ్మందిరం—మరొకరు మసీదు అంటే మరి మామాటేమిటి? చనిపోయిన పుణ్యమూర్తిగారు చర్చి కట్టుకోమన్నారిక్కడ!

దేవ—పిట్టపోరూ పిట్టపోరూ పిల్లితీర్చినట్టుగ యిదింకాబావుంది. మాయిద్దరికీ తగువు తేలక మేం చస్తుంటే మధ్య మీరొచ్చి 'చర్చ్' అంటారేమిటండీ!

విలి—అవును దేవయ్యాగారూ! ఆస్థలంలోమీకెంత హక్కువుందో మాకూ అంతే హక్కుంది.

రహీం—అల్లా ముఖం చూసి చెప్తున్నాను. అక్కడ మాదీ మసీదు కట్టాల్సిందే !

దేవ— మీదికాని దానికి మీరెందుకు తగువులాట! ఆస్థలం రాములవారి కోవెలకని యిచ్చిందే!

విలి— అదంతా అబద్ధం. ప్రభూమీద ప్రమాణం చేసి చెప్తున్నాను. అక్కడ చర్చి కట్టడానికి హక్కుంది.

రహీం— ఆమాట మరలా హంటే రక్తం తాగుతాన్....

విలి—రహీం! మాటలు మీరుతున్నావ్! నీరవుకి

వేషాలు నాదగ్గర కాదు.

రహీం— హెవ్వా అన్నావ్?

(అమాంతంగా విలియం మీదికి రాబోతాడు— సరిగ్గా అదే సమయంలో లోపల్నుంచి భారతమ్మ వస్తుంది.)

భార—ఆగండి! ఏమిటి దౌర్జన్యం?

రహీం—హెవ్వా అమ్మా! మాదిబాగాలో ఒకరు చర్చికడతారట. ఇంకొకరు రామమందిరం కట్టుకుంటారట.

విలి—కడతావా... కట్టి చూపిస్తావా?

దేవ—అయితే మేమేమో గాజులు తొడుక్కున్నది?

రహీం— హెవ్వయ్యా! మాట్లాడుతావ్?

దేవ—నువ్వు మాట్లాడేది ఏమిటయ్యా?

భార—ఆగండి! ఆఖరికి ఈ వ్యాధి మీకూ సోకిందన్నమాట! మత కలహాలతో మనిషిని మనిషి చంపుకునే దారుణ స్థితి తెలిసికూడా మీరు పోరాటానికి సిద్ధపడ్డారన్నమాట!

రహీం—అదంతా మాకే మాలుమ్ హై! అక్కడ మసీదు కట్టి తీరాలి

భార—రహీం! అనాలోచితంగా మాట్లాడకు!

రహీం—(గద్దిస్తూ) హది మాయిష్టం!

భార—అలా ఎవరిష్టానుసారం వాళ్ళు ప్రవర్తిస్తే— యీసంఘం, యీసమైక్యత, యేమవుతుందో ఆలోచించు రహీం! ఇప్పు మసీదని, విలియం చర్చనీ, దేవయ్య రామమందిరం అనీ, ఎవరికి వారు వాదించుకుంటే తీరేసమస్యయిది? అసలు మతమంటే ఏమిటి? ఇష్టం అని కదా! దేవుడనేవాడు మనం కొలిచే రూపంలో వుంటాడు. ఆదేవుడ్ని ఎవరికి నచ్చిన పేరుపెట్టి వారు ఆరాధిస్తారు. తరిస్తారు. ప్రధానం ఆరాధనకాని, ఆలయాకారాలుకావు. అలాంటి ఆరాధనకు మసీదు అయితేనేం, చర్చి అయితేనేం కోవెల అయితేనేం మతం చీలికలతో ద్వేషాలు, పోరాటాలు, పెంచుకుంటే చెడిపోయేది ఎవరు? మనం, మన వ్యవస్థ, మనసంఘం, మనదేశం, అందుకే మనమందరం సంఘటిత భావనతో కలసి మెలసి ఏకోన్ముఖంగా ఆరాధించుకోవడానికి అనువుగా ఆస్థలంలో ప్రార్థనామందిరం నెలకొల్పుకుందాం! శ్రమదానం చేద్దాం! సహజీవనం నెరపుదాం!

# సమత

రహీం—అఖ్ఖర్లేదు. ప్రార్థనామందిరం.పాడు మందిరం నై! మసీదు కట్టాల్సిందే: అడ్డువచ్చే వాళ్ళని కుత్తుక కోస్తాను.

విలి—ఇది నీడి పుర్రెడు పుట్టిన బుద్ధికాదు. ఆనాగభూషణంగారి అండజూసుకునే అలావిజృంభిస్తున్నాడు. లేకుంటే నీడికింత దమ్ము ఎక్కడొచ్చింది?

రహీం—అరే! హెవ్వా అన్నావ్?

(చెంపదెబ్బ కొడ్తాడు.)

విలి—ఆ! నన్ను కొడ్తావా? చూడు నిన్నేం చేస్తానో!

(అమాంతంగా తలపడబోతారు.)

భార— విలియం!

(విలియంను ఆపుతుంది. సరిగ్గా అదేసమయంలో చేతనున్న కర్రతో చావుదెబ్బ కొడ్తాడు రహీం! విలియం 'అమ్మా' అని పడిపోతాడు. బయట్నుంచి వచ్చిన రవి అదృశ్యాన్ని చూచి గబగబా ముందుకొస్తాడు.)

రవి—రహీం! ఏమిటీఘోరం?

విలి— తప్పుకోండి! నీడి అంతుతేలుస్తాను.

రహీం—అడుగు ముందుకి వడిందా ..ఖైమా కొడ్తానుబే! ఖబడ్దార్!

భార— విలియం ఆగు! ఒకచెంపకు దెబ్బ తగిలితే మరోచెంప అందించమన్నారు మహాత్మా గాంధీ... అంటే దెబ్బతిన్నవాడు అల్పుడనీ, కొట్టినవాడు అధికుడనీ, అర్థంకాదు. మనిషిని మనిషిగా గౌరవించడం నేర్చుకోమని ఆ అంతరార్థం: తెలీక రహీం తొందర పడ్డాడు. అంతే! ఆ. రవీ! విలియంని వెంటనే ఆస్పత్రికి తీసికెళ్ళి చికిత్స చెయ్యి.

రవి—అమ్మా!

భార—మరేం మాట్లాడకు. ఆవేశంలో ఏమాట మీరినా— ప్రస్తుత పరిస్థితుల్లో ప్రళయం తప్పదు. ముందు విలియంని తీసుకుపద. ఊ.వెళ్ళు.

(అంటూ యిద్దర్నీ బయటకు తీసికెళ్తుంది. వాళ్ళు వెళ్ళాక—లోపల్నుంచి నాగభూషణం నవ్వుతూ వస్తాడు.)

నాగ—బేష్! రహీం! చక్కగాఆడావు నాటకం! దేవయ్యా!

దేవ—(చేతులు నలుపుతూ) అయ్యా!

నాగ—ఈ దెబ్బతో భారతమ్మ పనిరా! లేకపోతే కక్ష నామీద కడుతుందటయ్యా!

రహీం—సెలవియండి సాబ్! ఏం చెయ్యమంటారో!

నాగ—ఇదే సరైన సమయం. ఆస్థలంలో రామాలయం కట్టాలని నువ్వు. లేదు మసీదు కట్టాలని రహీం — ఇద్దరికిద్దరూ రెచ్చిపోండి. మత కలహాల పేరుతో మారణహోమం సృష్టించండి.! నరుక్కు చస్తారు. జనం, దాంతో సౌభాగ్యము, సంస్కరణం, అంతా సర్వనాశనమవుతుంది. ఆ! ఇదిగో డబ్బు..! రహీం ఈ డబ్బు నీయిష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టు. కడుపారా త్రాగు! నీవారందర్నీ తాగించు. ఆనిషాలో విజృంభించు. గృహ దహనాలు ప్రారంభించు.

దేవ—అయ్యబాబోయ్‌గృహదహనాలే!

నాగ— నోర్ముయ్: చెప్పేది శాంతంగావిను! (రహీంతో) చూడు రహీం. ముందు నీయింటికి నువ్వు తగులబెట్టుకో.. ఆనేరాన్ని హిందువులమీదికి నెట్టివెయ్యి! అంతే! దాంతో హిందువుల్ని రెచ్చగొడ్తాడు దేవయ్య. ఇలా ఒకరిని గాని ఒకరికి ద్వేషం, పగ, రగులుకు పోతుంది. అప్పుడూ మత కలహాలు విజృంభిస్తాయి సర్వనాశన మవుతుంది. గ్రామం!


దేవ—(పగలబడి నవ్వుతూ.) ఓహోహో...ఏం బుర్రండీ... మీది?

రహీం—దేవయ్యా! రావయ్యా! చూపిద్దాం మా తడాఖా!

నాగ—'జాగ్రత్త' అనుకున్నది అక్షరాలా అమలు జరిపారా.... అందలం ఎక్కిస్తాను లేదా ఈ రహస్యం మరో మనిషికి తెల్సిందా.. సఫా! ఖబడ్దార్! వెళ్ళండి!

దేవ—చూస్తారుగా..! (రహీం దేవయ్యాయిద్దరూ బయటకు నాగభూషణం, తనగదిలోనికివెళ్తారు).

(బయట్నుంచి భారతమ్మ, రాము, రవిలు వస్తారు. భారతమ్మ సరాసరి లోనికెళ్తుంది.)



రవి— ఏమైనాగానీ ఇది సహించరాని విషయ మన్నయ్యా!

రాము—కావచ్చు! కాని ఆశ్రమంలో హిందూ, ముస్లిం, క్రిష్టియన్లందరికీ సమాన హక్కుంది. అందుకే ఏదోలా మూడు మందిరాలనూ సమన్వయపరచి— అమ్మచెప్పినట్టు ప్రార్థనామందిరం నిర్మించుకునేలా కృషి చెయ్యాలి.

రవి—ఆలోచిస్తే అంతా నాగభూషణంగారి పన్నాగంలా కన్పిస్తోంది. ఒకవేళ దొంగ దెబ్బతీయడానికి రహీం, దేవయ్యలను యీ నాగభూషణంగారే ప్రేరేపించలేదుగదా.

రాము—అదే నిజమైతే నాగభూషణం అంతు తేల్చాలి. అమ్మమీద, అమ్మమాటను అతిక్రమించని రైతులమీద కక్ష పెంచుకున్నాడు.

(లోపల్నుంచి భారతమ్మ వస్తుంది. చేతిలో చిన్నసంచి వుంటుంది.)

భార— అని మీరెందుకనుకోవాలి?

రాము—లేకపోతే ఏమిటమ్మా యిది? రహీం విషయం నాకు బాగా తెల్సు. నాగభూషణంగారి మద్దతులేనిదే అతనలా చెలరేగడు. సైగావిలియం సంఘసేవకుడు. విలేజి లెవల్ వర్కరన్న విషయం కూడా గుర్తించకుండా చేయి చేసుకున్నాడంటే..

భార—సరే జరిగిందేదో జరిగిపోయింది. అదంతా ఒక పీడకలగా మర్చిపోదాం. శాంతియుత సహజీవనానికి సాధన చెయ్యడం మన ధర్మం. నేను మహిళా మండలికి వెళ్తున్నాను. శాంతంగా వుండండి.

(భారతమ్మ వెళ్తుంది.)

రవి—అన్నట్టు నాగభూషణాన్ని కనిపెట్టివుండమని పోలీసు రిపోర్టు యివ్వడం మంచిదేమో అన్నయ్యా

రాము—వద్దు తమ్ముడూ అది కేవలం మన అపోహ అయితే అనవసరమైన అనర్థాలకు దారి తీస్తుంది. ఈ భూముల తగాదా విషయం పరిష్కారం అయ్యేవరకూ మనం తొందర పడకూడదు.

(దేవయ్య ఆఘమేఘాలమీద పరుగెత్తుకొస్తాడు.)

దేవ—అయ్యా బాబోయ్ కొంప మునిగింది. రక్షించాలి.

రాము—ఏమిటి దేవయ్యా?

దేవ—ఆ రహీంగాడు లేడూ వెధవన్నర..వెధవ.

ఇద్దరూ—ఆ..

దేవ— వాడుబాగా తాగి నాయింటికే నిప్పెట్టాడు..

ఇద్దరూ—(ఆశ్చర్యంగా.) ఆ!

దేవ—అప్పుడు బాబూ: ఇల్లు తగలబడిపోతోంది.

రవి—మరి, చూస్తూ వూరుకున్నావా దేవయ్యా!

దేవ—వూరుకోక వురెట్టుకునేదా చెప్పండి! హిందువుల యింటికి నిప్పెట్టరా అంటే.. వాడు తిన్నగా నాయింటికే పెట్టాడు నిప్పు.:

ఇద్దరూ—ఏమిటీ?

రాము—ఏమిటి దేవయ్యా నువ్వంటున్నది?

దేవ—నాగభూషణంగారి ఉప్పులోపడి మోసపోయాను. అమ్మగారిమీద, గ్రామప్రజల మీద, కక్షకట్టి మతకలహాలు సృష్టించమని రహీంగాడిని ప్రేరేపించాడు నాగభూషణం! పిల్లల గిలవద్ద డబ్బుకక్కుర్తిపడి నేనూ చేతులు కలిపాను. కాని, నాయింటికే రహీంచేత నిప్పెట్టిస్తాడనుకోలేదు. (లబోదిబోమంటూ) సర్వనాశనమైపోయింది బాబో... సర్వనాశనమైపోయింది. గంపెడు సంసారం! ఏపెట్టుకుందికి పోను. ఏంతిని బతకను?

రాము—ఎంతద్రోహం తలపెట్టావ్ దేవయ్యా?

రవి—అన్నయ్యా! ఇతన్ని ఏం ప్రయోజనం! ఇక్కడిలా ఆలోచిస్తూ కూచుంటే అవతల ఏం ఉపద్రవం ముంచుకొస్తోందో రా అన్నయ్యా.... వెళ్దాం!

(ఇద్దరూ బయటకి పరుగెత్తుతారు.)

దేవ—(వాపురమంటూ) అట్టా ముక్కలకూడా చేస్తున్నా ఉయ్యండ [illegible] బతుకు. ముందు గొయ్యి—వెనక నుయ్యి!

(నాగభూషణం బాగా తాగి లోపల్నుంచి వస్తాడు)

దేవ—(చూసి.) అయ్యా నాగభూషణంగారూ! మీరేది న్యాయమూ చెప్పండి! నన్ను నమ్మించి ఆఖరికి ఆ రహీంచేత నాయింటికి నిప్పంటించ చేస్తారా? అక్కడ మారణకాండ జరిగి ప్రజలు గగ్గోలు పెడుతుంటే మీరిక్కడ నిషాలో కుషీ చేస్తున్నారా!

నాగ—(కోపంగా) నోర్ముయ్! [illegible]


# చర్మం మీద రోమాలు..
# ఎంత రోతగా వుంటాయి!



పెద్ద సమస్యే. రేజర్లతో గీస్తే ఆరోజుకారోజు రెట్టింపు పెరుగుతాయి. ఆ బాపతు క్రీములూ సబ్బులూ వాడితే పైపైనే పోతాయి కానీ మూలంనుంచి పోవు. అంటే ఉపయోగం సున్నా. మళ్ళీ యథాలీతే.

కాని, ఇప్పుడు రోమాలను మొదళ్ళనుంచి నిర్మూలించడానికి ఒక క్రొత్త శాస్త్రీయకరమైనది—ల్యూర్ కోల్డ్ వాక్స్ హెయిర్ రిమూవర్

ల్యూర్ కోల్డ్ వాక్స్ రోమాలను మూలం నుంచి నిర్మూలిస్తుంది. వాడగా వాడగా అసలు రోమాలు రావడమే సన్నబడిపోతుంది.

రోమాలను నిర్మూలించి, శుభ్రమైన, అందమైన చర్మాన్నిస్తుంది—ల్యూర్ కోల్డ్ వాక్స్ హెయిర్ రిమూవర్.



మొత్తం గ్రామం గ్రామం నాశనమై పోవాలిగాని.

దేవ— మీనాశనం కోరుకునే గ్రామ వినాశనానికి దిగారు. ఇక మిమ్మల్ని ఆదేవుడేరక్షించాలి.

నాగ—నోర్ముయ్!

దేవ—అంతా అయిపోయిం తర్వాత, భయపడతాననుకున్నారా? భారతమ్మ— ఆమెకొడుకులు దేవుళ్లాంటివారు. వారి మాటలు కాదని మీతో చేతులు కలిపాను. ఆడమన్న ఆటల్లా ఆడాను. ఆఖరికి నాచేత గొయ్యి తీయించి, ఆగోతిలో నన్నే పూడుస్తారా? ఇక మీఆటలు సాగనివ్వను. మీరు తలపెట్టిన దుష్కార్యాలన్నీ పోలీసులకు చెప్పి మీ అంతును కనుక్కుంటాను.

నాగ—(మహోద్రేకంతో.) ఏయ్ దేవయ్యా! ఏమిటా అన్నావ్?

(కొట్టడానికి అమాంతంగా చెయ్యెత్తుతాడు. సరిగ్గా అదేసమయంలో రహీం—ఆవెనుకవిలియం పరుగెత్తుకొస్తారు. రహీం చేతుల్లోపలుగువుంటుంది.)

రహీం—(మహోద్రేకంగా.) మనకీ వదలండి హిమ్మీకా ఫు చూస్తాన్.

విలి—(రహీంని ఆపి) రహీం ఆవేశపడకు. నామాట విను

రహీం—(కోపంగా) నహీ..నహీ..నహీ....

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!
Bensons-2141-TEL

35సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్టు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
కె అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట,
రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర
ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544
Asian

నాగ—(గద్దిస్తూ) రహీం నీకేం మతిపోయిందా?

రహీం— మతిపోయింది నాక్కాదుసాబ్. మీరు నాకు డబ్బిచ్చి తాగించారు. మనసు విరిచారు. కొంపలు తగులబెట్టమన్నారు. మత కలహాలు రేపమన్నారు కానీ...కానీ...

నాగ—రహీం..

విలి—గద్దించకండి మీరాడే చదరంగంలో రహీం లాంటి అమాయకుల్ని పావులుగా ఉపయోగించుకోవాలనుకున్నారు. కాని, మీరు తలపెట్టిన మరణ హోమానికి రహీం తనబిడ్డనే బలిచేసుకోవాల్సిన దుస్థితిఏర్పడింది.

నాగ—ఆ

రహీం—అవును. పసిపిల్లల్తో ఆడుకుంటున్న నారుస్తుం బేటా నేను అంటించిన మంటల్లో చిక్కడి పోయాడు. అప్పుడూ—పాపం ఈ విలియం సాబ్‌పోయి నాబిడ్డను కాపాడాడు. ఎవరిమీదయితే చెయ్యిచేసుకున్నానో..వారే అల్లాలా వచ్చి నా బిడ్డని రక్షించారు. నాదీకళ్లు తెరిపించారు.

నాగ—అందుకని.. నన్నెదిరించి మాట్లాడుతావా?

దేవ—మాట్లాడ్డం కాదు. నిజం బయటపెడ్తున్నాం.

నాగ —నోర్ముయ్..

రహీం—నోరు మూతవేసే కాలం పోయిందిసాబ్,

నాగ—అయితే ఏం చేస్తావ్?

రహీం—నీదీ ప్రాణం తీస్తాను.

నాగ—ఆ

ముగురూ—అవును (అంటూ నాగభూషణాన్ని చుట్టు ముడ్తారు.)

(రాము, రవిలు ఆవేశంతో వస్తారు.)

రాము—ఇంత ద్రోహం తలపెట్టిన వాడ్ని యిలావొదు. చేసిన తప్పులు నోటితో చెప్పించాలి. ఉండు తుపాకీ తెస్తాను.

(లోపలికి పరుగెత్తుతాడు.)

రవి—ఇక తప్పించుకోలేవు నాగభూషణం నువ్వు సృష్టించిన మంటలిక్కడ చల్లబడ్డాయి — మండుతోన్న గుండెలు మాత్రం నీరక్తం కళ్లజూడందే చల్లబడవు.

(రాము తుపాకీతో వస్తాడు.)

రాము—(ఒక్కొక్కడుగూ వేసుకుంటూవస్తూ) ఇది మానాన్నగారిది. ఇప్పుడొచ్చింది దీని అవసరం? ఇంతమందిని క్షోభపెట్టావే—చెప్పు నిన్నేంచేయాలి (తుపాకీ ఎక్కుపెడతాడు.)

గొ—పేదల పెన్నిధినని చెప్పుకుంటూ! డబ్బుతో సాధించలేనిది లేదని నిరూపించావ్: కాని, నేటికి నీ పాపం బద్దలైంది. చెప్పు! ఇప్పుడేం చేస్తావ్?

గొ—అన్నదమ్ముల్లా సహజీవనం సాగిస్తున్న మామధ్య మత కలహాలు సృష్టించావ్! చెప్పు ఇప్పుడు నిన్నేం చేయాలి

దేవ—నాకు డబ్బాశ చూపించి—కీలుబొమ్మలా ఆడించావు చెప్పు! ఇప్పుడు నిన్నేం చేయాలి?

రహీం—హంకో కసాయిని చేశావు. చెప్పు.... నిన్నేం చేయాలో చెప్పు!

అంతా (ముక్తకంఠంతో) చెప్పు! నిన్నేం చేయాలో చెప్పు?

(అంతా చుట్టూచేరి చెప్పు నిన్నేం చేయాలో చెప్పు! అంటూ రెచ్చిపోతూ తమ చేతుల్లోని ఆయుధాలను గురిపెట్టి నాగభూషణం మీదికి దాబోతుండగా— సరిగ్గా అదే సమయంలో మెరుపులా వస్తుందక్కడికి భారతమ్మ.)

భార—ఆగండి!

(ఒక్కసారి ఆగిపోతారంతా!)

అంతా—అమ్మా!

భార—ఈ మరణాయుధాలతో హత్యచేసి ప్రాణం తీస్తే— కలిగిన నష్టం భర్తీ అవుతుందనుకుంటున్నారా! ఒకర్నొకరు చంపుకోడానికా పూజ్య బాపూజీ మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించింది. (గద్దిస్తూ.) దించండి. మీ ఆయుధాల్ని! కేవలం తుపాకీ గుళ్లతోనా విప్లవ హింసలోనా వ్యవస్థలోనూ, వ్యక్తుల్లోనూ, మార్పుతేవాలనుకుంటే— ఏ తుపాకీ గుండు మార్పుగలిగింది మూడు వందల యేళ్లు భారతదేశాన్ని పాలించిన బ్రిటిషు వార్ని? ఏ తుపాకి గుండుతో సాధించుకోగలిగాం. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని? పూజ్య బాపూజీ కలలుగన్న రామరాజ్యం, శాంతి నెహ్రూ ఆశించిన శ్రేయోరాజ్యం నీర శాస్త్రీజీ కోరిన సర్వమానవ సమానత్వం — ఈ దేశంలో — ఈ సమాజంలో రూపొందాలంటే ఆయుధ సిద్ధాంతం కాదు. కావాల్సింది—అహింసా సిద్ధాంతం!

(అంతా తలలు వాల్చుతారు.)

భార—(అందర్నీ ఉద్దేశించి.) వారికి స్వేచ్ఛనివ్వండి! (నాగభూషణంతో) ఇక మీరువెళ్లవచ్చు కానీ, నాగభూషణంగారూ ఏనాటికైనా దేశ, కాలమాన, పరిస్థితులకు తలవంచక తప్పదని గుర్తుంచుకోండి! స్వార్థం కోసం, పదవులకోసం మనుష్యులమధ్య మతకలహాలు సృష్టించి,వర్గ,పోరాటాలు పెంచితే దేవుడు సహితం రక్షించని విధంగా యిల్లాంటి గుణపాఠం నేర్పితీరుతుందన్న సత్యాన్ని మర్చిపోకండి! వెళ్లండి!

నాగ—(ఒక్కసారి బావురుమంటూ.) అమ్మా! భారతమ్మా, నాకళ్ళు తెరిపించావు తల్లీ! నాకళ్ళు తెరిపించావ్ (అందరివేపు తిరిగి.) బుద్ధొచ్చింది. ఇకపై మీతోపాటే సేనాను. నాకున్న భూముల్ని డబ్బుని మన గ్రామస్థులందరికీ పంచి యిస్తాను. మీ లక్ష్యమే నా లక్ష్యంగా సాగిస్తాను. నన్ను నమ్మండి!

(భారతమ్మ కాళ్లమీద కొరగిపోతాడు—అందరి కళ్ళూ ఆనందంతో విప్పారుతాయి. తెరలోంచి—

జననీ జన్మభూమిశ్చ...

స్వర్గాదపి గరీయసీ—

అనే శ్లోకం విన్పిస్తుంది. ఈ లోగా తెరతనపని తాను చేసుకుంటుంది.)

**(అయిపోయింది)**

గమనిక:—ప్రదర్శకులు ముందుగ రచయిత అనుమతి పొందడం విధిగా అవసరం.

బీసెట్టి లక్ష్మణరావ్.
ఆంధ్ర పత్రిక
గాంధినగర్.